# క్షమాపణ

తులసీకృష్ణ

వసంతరావు కారు దిగేసరికి, భార్య 'ముక్తిమణి' యెదురుచూస్తున్నట్లుగా మెట్లు దిగొచ్చి పాప, 'హృదయరమణి' నందుకుంది. పోకరు పాప బొమ్మలూ, మూటు కాళ్ళ సైకిలూ అన్నీ లోపలికి తీసుకెళుతున్నాడు. వసంతరావు మౌనంగా లోపలి కెళ్ళిపోయాడు. ఆమె లోపలి కెళ్ళిపోయేసరికి, పాప వారించి తన పామన్నప్పి జాగ్రత్తగా చూచుకుంటోంది. అలసి, వాడిపోయిన ముఖంతో - తన బొమ్మ లేమైనా పోకరు దొంగిలిస్తాడేమోనని శ్రద్ధగా పరికిస్తోన్న పాపను చూసేసరికి ముక్తిమణికి నవ్వొచ్చేసింది. పోకరు కారులోంచి, ఓ వల్లిటీ, దొరుపాటి పుస్తకం తెచ్చి ఆమె చేతి కందించాడు. అలవోకగా తెలిపిచూసి, అది యింగ్లీషులో వున్న "రమణ మహర్షి" జీవిత్రగ్రేష్ఠి. అది గ్రహించి. ఎంతో ప్రేమతో, స్నేహంతో వెలిగే ముఖంతో. పరిమళం మోసుకెళ్తోన్న మందారపింలా యింట్లో కెళ్ళిందామె.

వసంతరావు తువాలుతో ముఖంతుడుచు కుంటూ కుర్చీలో కూర్చొనున్నాడు. ఆమె పాపను దించేసి. "కాఫీ" తీసుకొచ్చి-భర్తకూ, పాపకూ అందించింది.

"తినవచ్చావుల్లై వెళ్ళారా?" - "ఆఁ..." "మరి...తొందరగా వచ్చారే?"......

"అక్కడే వుండమంటావా?" ఆమె భయాలున అతనికేసి చూసింది. చూపు - మెరుపులా అతని చీకటి హృదయాన్నిచీరి స్తే క్షణం విస్తుపోయాడు. వెంటనే, మూడ్ మార్చి నవ్వేశాడు. కాపీ హృదయం విచ్చిన చిరు ఆతికినట్టులేదు. అతికెయ్యాలనే ప్రయత్నం మల్లే. మరో క్షణంలో ఆమె నవ్వేసింది.యుగయుగాలుగా పురుషుడిదోషాల్ని క్షమిస్తోన్న స్త్రీత్వంతాలూకు క్షమాపూర్వకమైన నవ్వు!

"అంతా బావున్నారా?— చలంగారూ? నర్తకీ - పకపకా, యింకా, ఆవుని తోలుకెళ్ళే ఆ అరవపిల్లా..." అతను బావున్నారన్నట్లు తలూపుతున్నాడు కాఫీ సిప్ చేస్తూనే. 'మరి... మా అక్కయ్యా...'—'ఆ...మీ అక్కయ్య గూడా...' 'మీరెళ్ళేసరికి మా బావ వున్నాడా?' 'ఏం? వుండ కెక్కడికెళ్తాడని నీ వూహ?' ఆమెకు తీవ్రమైన వేడిగాలి ముఖాన్ని చరిచి నట్లయింది. మరేమీ మాట్లాడలేదు 'కాఫీ' త్రాగుతూనే పడి నిద్రపోతోన్న పాపనెత్తి మంచంలో పడుకోబెట్టోంది. వసంతరావు లేచి బయటికెడుతోన్నట్లు తోస్తూనే, 'స్నానం చెయ్యరా?' అందామె. 'తర్వాత చేస్తాను' అందామనుకున్నాడు గానీ, బైటికేమీ అన్లే దతను. ఆమె ఓ క్షణం వెళ్ళిపోతున్న అతని కేసి చూసి, కాఫీ కప్పులు తీసుకుని యింట్లో కెళ్ళిపోయింది.

వసంతరావు అలా నడచి - పెన్నానది మీదుగా రెండు ఫర్లాంగులు వెళ్ళి - యిసుకలో కూర్చుండి పొయ్యాడు. తూర్పున మహాబలి పురపు జాతిరథాల్లాంటి మబ్బులు! పడమట వేటగాడు సంధించినట్లు మబ్బుల్లోకి దూసు కెళ్ళే హిరణ్మయ కిరణాలు. అక్కడక్కడా సన్నగా ప్రవహిస్తున్న నీటి జాళ్ళదగ్గర వొంటి కాలితో నిల్చున్న కొంగలు! ఒక వందగజాల దూరంలో నీళ్లు మోసుకెళ్తోన్న స్త్రీల నవ్వులు! అతని ఆలోచన్లు నీటిలో చేపజాడల్లే అల్లుక పోతున్నై! భార్య దగ్గర చూపిన విసుగు దలను గురించి పశ్చాత్తాపం కలుగుతోంది. జీవితం ఒక ప్రవాహానికి పోలిస్తే - అందులో

తను చేసిన "తప్పు" అనేది ఒక "రాయి"లా పడితే, తను చూపిన చిరాకు దాన్ని వలయాలుగా వ్యాప్తం చేసి నలుమూలలకూ నెట్టేసి పెద్దదిగా చేసిందన్నమాట!

పాపం ముక్తిమణి తప్పేముంది? "మీరెళ్లేసరికి మా బావవున్నాడా?" అంది. ఆలోచిస్తే తను విసుగుదల చూపటానికి తగిన కారణముందేమో ననిపిస్తోంది. మిగతావాళ్ళ క్షేమం కనుక్కుంది, కానీ వాళ్ళ బావ క్షేమం ముఖ్యం కాదు; తనక్కడుండటమే కావలసింది. ఈ ప్రశ్నలో ఆ అర్థముందా? - లేక యాదృచ్ఛికమేనా?

అతనాలోచన్లు తన జీవితంలోని మూడు కాలాల మీద నీడపడేస్తున్న మీనాక్షి మీదికెళ్ళినై. అసలు పెళ్ళికాకపూర్వం - ముక్తిమణిని చూడ్డానికి మోహనరావుతో కలసి వెళ్ళినప్పుడు, మీనాక్షి దివ్యదర్శనమయింది. బాలనివర్షఋతువులా - శ్రీనాథుని సీసపద్యంలా చెరిగిపోని స్మృతి! మొదటి గదిలో కూర్చుని వీణ వాయిస్తోంది. తలలో తన కిష్టమైన సంపెంగలు! ఒక్క క్షణం లోపలికెళ్ళడానికి కాళ్ళాడలేదు. వర్తమానానికీ-మనిషికీవున్న బంధం తెంపేసినట్లయింది. ఆమె చప్పున వీణప్రక్కన పెట్టేసి లేచి నిల్చుంది. ఈమె యింతకుముందు జన్మల్లో-'ముద్దుపళని, రంగాజమ్మ - యింకా అంతకుముందు హిమాలయాలపై - యింపుతను కొత్త వీణ వాయించిన వరూధిని! జీవితం తనకు ప్రసాదించబోయే వరాన్ని తలుచుకుని విభ్రాంతిలో పడిపోయ్యాడు. 'ఈమె వీళ్ల పెద్దమ్మాయి-ఈమెకు సంబంధం ఖాయమయింది. రెండో అమ్మాయికీ కుదిరితే యిద్దరికీ వొకేసారి చేసెయ్యాలని వీళ్ళ నాన్నగారి ఆలోచన.'

ఆ క్షణంలో మోహనరావు పరిచయ వాక్యాలు తలచుకుంటే, యిప్పటికీ అతని మీద యేదో తెలీని వెగటు కలుగుతుంది. మనస్సు అతిచిత్రమైంది! ఒక్కోసారి దీన్ని గూర్చి ఆలోచిస్తూ - కూర్చుంటే యింతకన్నా హాస్యకరమైంది, బయట ప్రపంచంలో మరెక్కడా లేదనిపిస్తుంది. ఈమె కాకపోయింతర్వాత యిక రెండో అమ్మాయిని చూడ్డమెందుకూ? అనిపించింది. కానీ, ముక్తిమణిని చూసిన తర్వాత తన అసమ్మతి తెలియజేయటం మరచిపోయాడు. ఆమె కాకపోయిన తర్వాత యికెవరయితేనేం? అన్నట్లుగా - వొప్పుకుని వుండిపోయాడు. అందమైన వాళ్ళకు, అనాకారుల్ని జత గూర్చటం, రచయితలకూ, దేవుడిగ్గూడా అలవాటై పోయిందిలా వుంది. మీనాక్షినీ— ఆమె భర్త విద్యారావునీ, శృంగారపరంగా వూహించి, వ్యంగ్యచిత్రంలా తయారయితే, చూసినవ్వుకోవటం అతని వ్యక్తిగతమైన "హాబీ" అయిపోయింది. అలాంటి భర్త దొరికినందుకు, మీనాక్షిపై తనకున్న అపారమైన సానుభూతి ప్రదర్శించాలనుకున్నాడుగానీ, ఆమె అందుకు అవకాశమివ్వలేదు అంతమాత్రం చేత, మీనాక్షి సుఖపడిపోతోందని తనేనాడూ వొప్పుకోవటం లేదు. జీవితంలో యేర్పడిన అసంతృప్తిని-ఆమె అహంభావపు నటనతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందేమోననేదీ—అతని నమ్మకం, ఏది ఏమైనా ముక్తిమణిలో పెళ్ళయిన తరువాత, తనది అనుకూలమైన దాంపత్యమనీ మీనాక్షిని మర్చిపోయాననీ అనుకునేవాడు; కానీ, ఆలోచిస్తే అంతేనా?

తన జీవితమనే మహాగ్రంథంలో యెక్కడో ఓ పేజీలో 'మీనాక్షి స్మృతి' అనే మొగలిరేక పడవేశాడు. అది సర్వత్రా వ్యాపించి పోయింది. అయితే పుస్తకం మూసేసి కూచుంటే, వారేమీ లేదు. తెఱచి చదవటమారంభిస్తే - వెన్నెల కురిసిన మంచులా సుకుమారంగా, పచ్చ కర్పూరపు పొగలా సుతారంగా గుండెలను చుట్టుకునే పరిమళం!

'పాప' పుట్టిన సందర్భంలో 'టెలిగ్రాం' అందుకుని అతనెళ్ళేసరికి, గుమ్మంలో మీనాక్షి యెదురయింది. 'మరదిగారు, కుమార్తెను చూసుకోటాని కొచ్చారమ్మోయ్' అని కేకేసింది.

'మరదిగారూ! చిత్రం చూశారా? పాపలో మీ పోలికల్లేనే లేవు. అదంతా నాలాగే వుంది-' అతను లోపలి కెళ్ళేసరికి ముక్తిమణి నీరసంగా పడుకుని వుంది. పాప తొడిమనించి రాలిన

పువ్వులాగుంది. ఆ పాపకు మీనాక్షి పెద్దమ్మ !- అంతా తమాషా !

"మా అక్కయ్యలావుందికదూ ?" అంది ముక్తిమణి. తలెత్తిచూసేసరికి మీనాక్షి నవ్వుతోంది.

ఈమె పోలికా ? ఏమో ? తనకేమీ కనిపించలేదు.

అప్పుడు రెండు రోజులు మాత్రముండి తనొచ్చేశాడు. ఆ రెండు రోజుల్లో - ఓసారి, మీనాక్షి కింకా సంతానం కలగనందుకు ఎత్తిపొడుపుగా ఏదో అన్నట్లు గుర్తు ! మీనాక్షి నవ్వి - అంది :

"పాపం మేం సుఖంగా బ్రతుకుతోన్నామని - ఎంత యీర్ష్య !!"

తర్వాతక్రిందటి సంవత్సరం. సంక్రాంతికి మామగారు స్వయంగా ఆహ్వానిస్తే, వెళ్ళేసరికి, విద్యారావు-మీనాక్షి చదరంగమాడుతూ కనిపించారు.

మీనాక్షి పరుగెడుతూవచ్చి, పాపనందుకుని, [illegible]. ఆతనుపాపతో పిల్లవాడిమల్లే ఆటాడ్డం చూస్తోంటే చోద్యంగా వుంది !

'చూడు మరదీ ! నీకు పాపనెత్తుకోవటమే రాదు. మావారికేసి చూడు.'

'అందుకేనే మీనా మనకు లేరు ?" అని పెద్దగా నవ్వారు విద్యారావు. మీనాక్షి నవ్వుతోంది. తనకేదో మొరటుగా కనిపించి నవ్వలేకపోయాడు.

మరునటిరోజు సంక్రాంతి ! ఆ రోజు తన అందం తనకే అపేక్షగా కనిపించింది.

'ఈరోజు మీరెంత అందంగా వున్నారో తెలుసా !' అంది ముక్తిమణి. అప్రయత్నంగా తనకెంతో ఉత్సాహమూ - గర్వమూ పొడుచుకొచ్చాయి. సాయంత్రం క్లబ్బుకెళ్ళి యింటికొచ్చేసరికి, చీకటి పడిపోయింది. ఇంట్లో యెవ్వరూ కనిపించలేదు. పెరట్లో ముక్తిమణి మందారం దగ్గర కూర్చునుంది. పాప పుట్టిన రోజు తను బహూకరించిన చీరె ధరించిన ముక్తిమణి - ఆకాశంలో మెరిసే చంద్రబింబంలా కనిపిస్తోంది. వెనకాల వెళ్ళి-భుజాల మీదుగా చేతులువేసి తనవేపు లాక్కున్నాడు. ఆమె వులిక్కిపడి, వెనుదిరిగి చూసి 'మరిదీ !" అంది ఆశ్చర్యంగా. తల తిరిగిపోయింది. సిగ్గు మొఖమెత్తకుండా అణచివేస్తోంది. "సయం...యింకా," అని నవ్వుతోంది మీనాక్షి. తనక్కడ నిల్చోలేకపోయాడు.

"వెళ్ళిపోతావేం ? కూర్చో ! చెల్లాయి,మా అమ్మ రామనాధంగారి యింటికి బొమ్మల కొలువుకెళ్ళారు." అంటోంది "అప్పుడేలోని కడుగు పెడుతున్న విద్యారావు ఏం ! మళ్ళా వెడుతున్నావ్ ? లోపల 'మీనా' వుందిగా పద" అన్నాడు. తనేదో సమాధానం చెప్పి బైటికడుగేశాడు. ఆ సంఘటన జన్మంతా మరిచిపోలేదు,తర్వాత,ముక్తిమణి "అలాగున్నారేం ?"






అంది. 'ఎలాగున్నాను?' అని నవ్వాడు. నవ్వు గలిగినందుకు మనసులో కొంచెం సంతోషం కలిగింది. అప్పు డతనికో విచిత్రమైన వ్యూహ హారం కలిగింది, జీవిత మొక యుద్ధరంగమనీ, తన భార్య ప్రతిద్వంద్వేననీ, - తను యెన్నో రకాలుగా బాణ ప్రయోగాలు చేయడం నేర్చుకున్నాడు గబట్టి యిక ఫర్వా లేదనీ, యిక భార్యకు వోడిపోననీ నమ్మకం కలిగింది.


ఈ వూహ ఇప్పు డాలోచిస్తే నవ్వు కలిగిస్తోంది.

"ఈ చీరె యెవరిది?" అన్నాడు. ఆ విషయం ముఖ్యమయింది కానట్లూ, వూరికే "సింపుల్" గా అడిగినట్లు.

"మా అక్కయ్యది-ఆమె నాచీర కట్టుకుంది. ఏం - బావులేదా?"

"ఉఁహూ...ఏమీలేదు. ఊరికే...?

"ఒకవేళ మా అక్కయ్యను నేననుకునే భ్రమపడ్డారా యేమిటి?" అని నవ్వింది ముక్తిమణి.




అతనికి భయమేసింది. ఆమె నవ్వుతోని చూసిందిగావీ, యేదో బాధించినట్లు హృదయ కుహరాల్లో కాగడావేసి గాలించినట్లు-లోలోపలవాడిగిపోతున్నతనుదొరికిపోతున్నట్లు-యిదంతా తన వూహేనేమో?

ఊహ కాదని యింకోసారి ఋజువయింది. రమాకాంతం అనే తన స్నేహితుడు వుద్యోగమనే కెరటంమీద కొట్టుకుని వచ్చి - మీనాక్షి వున్న చిత్తూరులో నివసించడమే కాకుండా, తన పెళ్ళికి తప్పకుండా రావలసిందని ఆహ్వానం చేశాడు. స్నేహరీత్యా వెళ్ళవలసే వచ్చింది. మీనాక్షి 'పాప'ను చూడాలనుందని వుత్తరాలు రాస్తోందని, ముక్తిమణి పాపనూ ప్రయాణం చేసింది. తీరా ప్రయాణం ఖాయమయిన తర్వాత 'నాకేమో వెళ్ళాలనిపించ లేదు మణీ' అన్నాడు. అలా యెందుకన్నాడో అర్థం కావటంలేదు. 'ఎందుకని వెళ్ళరు? మహ చక్కగా ... వెళ్తారులెద్దూ!'- అంది చిరునవ్వుతో. చకితుడై- చప్పున ఆమె ముఖంకేసి చూశాడు. ముక్తిమణి- 'పాప' దుస్తులు 'సూట్ కేస్' లో చేరుస్తోంది. "మణీ ..పిలుపులో వుద్రేకం పలికినందుకు తనే ఆశ్చర్యపడ్డాడు. తలెత్తి చూసింది. 'ఎందుకన్నావల్లా?' స్వరం యింకా స్వాధీనపడలేదు. ఆమె ముఖం చూస్తూంటే తను అనవసరపుఅనుమానంతో దిగజారడం లేదు కదా? అనిపించకపోలేదు కావీ. ఆమె చిరునవ్వు తలుచుకుంటే, అది వొట్టి నవ్వేనను కోవడం కష్టం! దుడుకుగా-కొంచెం వుడుకుగా ఆమె చేయందుకున్నాడు.

"చెప్పు?—" "ఏమిటి?..." "—నీ శ్లేష—కవిత్వానికర్థం?"

"ఎందుకని వెళ్ళరు: ఆయన మీ ప్రాణస్నేహితుడన్నారుగా మరి? ... ఆమె ముఖం-యెంతో శాంతంగా — సౌమ్యంగా వుంది. నిస్సహాయుడయ్యాడతను

మీనాక్షీ—' ద్వారావులు పాపను చూసి—చాలా సంతోషపడిపోయారు. తను పాపనక్కడేదించేసి పెళ్ళియింటికెళ్ళాడు. ఆ పగలంతా పెళ్ళి హడావిడిలో గడిపి రాత్రి తిరిగి

యింటికొచ్చేటప్పటికి-విద్యారావు ఒకాయన్ని మద్రాసు హాస్పిటల్లో చేర్పించాలని వెళ్ళిపోయి నట్లు మీనాక్షి చెప్పింది.

తనకు కూడా బయట పడక యేర్పాటు చేసి వుంది. సప్తమి వెన్నెలకు చలిగాలి తోడై మరీ చాల్లగ వుంది. పలుచని, పొగమంచులాంటి మబ్బువెనకాల చందమామ కాల్చిన యెఱ్ఱ మతాబాలా వెలుగుతోన్నాడు. ప్రక్కగదిలో- పాప మీనాక్షి యేవో కతలు చెప్పుకుంటూ అలాగే నిద్రలో పడిపొయ్యారు. మీనాక్షి నిద్ర పోదనీ, నిదురిస్తోన్నట్లు యత్నం చేస్తోందనీ అనుకున్నాడు. భార్య అనుమానమూ - మీనాక్షి సరసోక్తులూ-చాలవలకూ తనలా ప్రవర్తించ టానికి కారణాలేమో ననిపిస్తోందిప్పుడు.

లోపల లైటు మండిపోతోంది. మీనాక్షి నిజంగా నిదురిస్తోంది - అంతటి సౌందర్యాన్ని నిర్లక్ష్యంగా వదలివేసి. అతను మంచంమీద ఓ వేపు కూర్చున్నాడు. సంతోషమూ-దుఃఖమూ రెండూ వొక్కసారిగా ముంచుకొచ్చనై! ప్రపంచంలో మంచీ - చెడ్డా అనేవి రెండేరెండు ఆకారాలు తాల్చినట్లు అవి మీనాక్షి- వసంతరావు లయినట్లు అనుభూతి కలుగుతోంది. పురాణాల్లో రాక్షసులు, ఎందుకంత తొందరలుగా తమ జన్మ ముగింపు చెయ్యాలని, ఆదుర్దాపడేవారో ఆక్షణంలో అర్ధమైపోయింది. మీనాక్షిపైన చాచిన తన చేయి వేళ్లు - ఆమె శరీరాన్ని చుట్టివేసి, దహించడానికి సిద్ధమైన అగ్నిశిఖలవల్లే కనపడుతోన్నాయి. మీనాక్షి చివాలున లేచి, మంచంనించీ దిగింది. ఒక్క నిమిషం - నిశ్శబ్దమయింది. అది ఒక్క నిమిషమా ? - ఒక్క జీవితకాలమా ?

'సౌందర్యం ఆకర్షిస్తుందని నాకు తెలుసు. అయితే అందుకు బహుమానం యీ నీచపు కానుకేనా మరచీ' ? ఆమె చెపుతోంది; ఆస్వరం జీవితంలో యెన్నడూ మరుపురాదు.

'భారతంలోఒక పద్యం-అది జ్ఞప్తికి రావటం లేదు కానీ, దాని అర్ధం చెప్తాను విను ! వ్యక్తియొక్క కర్మలకు సాక్షాత్తు ద్రష్టలెవరూ లేరని భ్రమపడకు ! అంతరాత్మ - ఆకాశం - భూమి - పంచభూతములు, వీళ్ళంతా సాక్షులుగాక మరెవరు !-అల్లాగే పాప నన్ను కాపాడగల దేవతలా నా ప్రక్కనపడి నిదు రిస్తోంది. పాపను మేల్కొల్పితే - తనకి జన్మ నిచ్చినవాడి ఈ అవతారాన్ని ఏ విధంగా వూహిస్తుందో గ్రహించి...వెళ్ళు ! 'పి కంతటి శిక్ష విధించటం నాకిష్టంలేదు.'

అప్పట్నించీ మనస్సు ఒకే గొడవపడు తోంది. చిరాకుతో, యింకా అల్పత్వంవరించే కన్నా- "ఆపరేషన్" చేసినట్లు ఈ అసం తృప్తిని బైటికిలాగేస్తే బావుణ్ను ! హఠాత్తుగా అతనికో ఆలోచన తట్టి-వుత్సాహంతో లేచారు. చీకటి కొంచెం - కొంచెంగా అల్లుకుంటోంది. దూరంగా యెవరో కుర్రాడు - "జెండాపై కపిరాజు -" పాడుతోన్నాడు. కౌంగలిక వేట చాలించి వెళ్ళిపోతునై ఓ !

ఆమెమెల్లిగాఅతని దగ్గరకొచ్చి..."లేవండి ..."అంది. "నీకో విషయం చెప్పాలి...... మణీ..." - "సరే...ముందు భోజనంచేద్దురు గానీ......"

"నీకు తెలీదుమణీ - నువ్విప్పుడు విని తీరాలి..." ముక్తిమణి నవ్వుతూ - అతని మీద వాలిపోతున్నట్లుగా అంది. "- నాకంతా తెలుసు - అంతా...మీ రేమీ చెప్పనవసరం లేదు."

'తెలుసా ?— ఏమిటి ? ఎట్లా తెలుసు ?'

'ఎట్లా తెలుసుకున్నానో చెప్పటం మరెప్పు డేనా వుంది. మీరిప్పుడు అలసిపోయారు. స్నానం చెయ్యాలి, ఆకలేస్తోంది - కనుక అన్నంతినాలి !'

వసంతరావుకు అనుమానం తీరలేదు. మీనాక్షి వుత్తరం వ్రాసిందా ? కొన్నాళ్ళకు మళ్ళీ అడిగాడు.

'ఏంతెలుసు ? ఎట్లా తెలుసు - ఎంతవరకు తెలుసు ?' అడగ్గాఅడగ్గా అంది ముక్తిమణి.

'నాకేమీ తెలీదు. కానీ, ఏం జరిగిందో - ఎంత జరిగిందో - తెలుసుకోవాలని తపనపడే వాళ్ళు క్షమించడంలోని ఔదార్యపు ప్రశాంతిని యెంతవరకూ అనుభవించగలరు గనుక అంది......

★